సాక్షి
జనగామ
శనివారం | 7 | జనవరి | 2023



పనికి తగిన వేతనం ఇవ్వాలి

యూనివర్సిటీల్లో వివిధ కేటగిరీలో పనిచేస్తున్న వారికి 'సమాన పనికి సమాన వేతనం' ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో



ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ పోటీలకు కేయూ జట్టు

ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ పోటీలకు కేయూ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు డాక్టర్ సవితాజ్యోత్స్న తెలిపారు.

- 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $29^{0}/13^{0}$

ఉదయం మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. రాత్రి పూట చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్మెట: మోడల్ పాఠశాలలో కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టుల బోధనకు తాత్కాలిక పద్ధతిన పనిచేయడానికి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శరత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 9లోపు దరఖాస్తులు పాఠశాలలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 96765 98411 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ప్రతిభా పరీక్ష

జనగామ రూరల్: విద్యార్థుల్లోని సాంఘిక, సామాజిక స్పృహను వెలికి తీయడానికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో శనివారం(7న) ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు జరిగే ఈ పోటీ పరీక్షలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొనాలని ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.సుభాష్, ప్రధాన కార్యదర్శి ఝాన్సీలక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.1,500, ద్వితీయ రూ.1,000, తృతీయ రూ.500 నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలి



జనగామ రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రాన్ని ఇండియా కరెన్సీపై ముద్రించాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఇందుకు ఈనెల 26 నుంచి ఏప్రిల్ 14 వరకు ప్రజాపోరు రథయాత్ర విశాఖ నుంచి ఢిల్లీ వరకు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జునను విశాఖపట్నంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రికి వివరించి తీర్మానంచేసి కేంద్రానికి లేఖ రాసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సలహాదారుడు ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

పీఆర్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా కమిటీ

జనగామ రూరల్: జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న పీఆర్ శాఖ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో అధ్యక్షుడిగా కోడెపాక అనిల్, ఉపాధ్యక్షుడిగా బి.మధు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల నరేష్, కోశాధికారిగా దోర్నాల శివప్రసాద్, కార్యదర్శిగా జి.రాజు, సలహాదారుగా ఎం.సందీప్‌ను ఎన్నుకున్నారు. ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని నూతన కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

రేపు 'గోపా' ఆత్మీయ వనభోజనాలు

జనగామ రూరల్: జిల్లా గోపా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న జనగామ మండలం పసరమడ్ల గ్రామంలో ఆత్మీయ వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు గునిగంటి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి సాయన్న హాజరవుతున్నారని, గౌడ బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శ్రీనివాస్, సంపత్, సోమేశ్వర్, ప్రవీణ్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయాల్లో సౌకర్యాలు కల్పిస్తాం..



చిల్పూరు: ఎల్లమ్మ ఆలయాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. చిన్నపెండ్యాల, చిల్పూరుగుట్ట ఆలయాలను శుక్రవారం సందర్శించిన ఆయన.. జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమ సమ్మయ్య, యదగిరి, రాజమౌళి, క్రాంతి, రామ్‌నారాయణ, గట్టు రవి పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

దేవరుప్పుల: మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు సంసిద్ధం కావాలని గర్ల్ చైల్డ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రోగ్రాం(జీసీఈపీ) కన్వీనర్ పి.సుకుమారి అన్నారు. 'మహిళలపై హింస ఆపండి' అనే అంశంపై శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో హెచ్‌ఎం సీహెచ్.ఉపేందర్ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో సీడీపీఓ అన్నారున్నీషా, వైద్యురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు సగమే..!



జాబితా నుంచి 796 మంది తొలగింపు

344 పేర్లతో అధికారుల రీ సర్వే నివేదిక

239 మందికి సర్కారు అనుమతి

మిగతా వారికి దశల వారీగా మంజూరు..!

జనగామ: కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు మరికొంత కాలం వేచిచూడక తప్పదు. అర్హత ఉండి.. జాబితాలో పేరు కోల్పోయిన సగం మందికి రాశనే ఎదురవుతోంది. పింఛన్ అర్హత వయసు 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు కుదించిన రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా పరిధిలో అర్హుల జాబితాను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. సాంకేతిక లోపంతో పాటు వివిధ నిబంధనల పేరుతో వందలాది మందిని పింఛన్ జాబితా నుంచి పక్కన బెట్టారు. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం కావడంతో.. సర్కారు రీ సర్వేకు ఆదేశించింది. ఆ నివేదిక మేరకు జాబితాలో సగం మందికే పింఛన్ మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించింది.

239 కొత్త పింఛన్లు మంజూరు

ఈ మేరకు రంగంలోకి దిగిన అధికారులు జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లడంతో పాటు రెండోసారి ఫీల్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ఇందులో 344 మంది అర్హులని తేల్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వే నివేదికను ప్రభుత్వానికి పంపించగా.. కేవలం 239 మందికి పింఛన్ మంజూరు చేస్తూ బడ్జెట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిగతా 105 మందితోపాటు మొదటి జాబితాలో మిగిలి ఉన్న 452 మంది తమ అర్హ[తను] నిరూపించుకునేందుకు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

నాలుగు నెలల పింఛను ఒకే సారి..

గత ఏడాది కొత్త పింఛన్లు మంజూరైన వారికి నవంబర్‌లో ఒకేసారి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌కు సంబంధించిన పింఛన్ డబ్బులు ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. అయితే ప్రస్తుతం మిగిలి ఉన్న పింఛన్‌దారులకు సైతం విడతల వారీగా జాబితాలో చోటు దక్కే అవకాశం ఉంది.

15,974 మందికి 796 తొలగింపు

జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, గీత, నేత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, హెచ్‌ఐవీ, ఫైలేరియా, డయాలసిస్ కేటగిరీల్లో 80,893 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.18.97 కోట్లు అందుతున్నాయి. ప్రభుత్వం గత ఏడాది పింఛను వయస్సు 65 నుంచి 57 ఏళ్లకు తగ్గించగా.. వేలాది వచ్చి దరఖాస్తులను అధికారులు స్క్రూటినీ చేసి, 15,974 మంది పేర్లను సర్కారుకు పంపించారు. మీసేవలో సాంకేతిక లోపానికి తోడుగా.. నిబంధనల మేరకు కారు, అదనంగా వ్యవసాయ భూమి, ఒకే ఇంట్లో ముగ్గురికి పింఛన్లు ఉన్నాయని చూపిస్తూ.. 796 మంది పేర్లను జాబితా నుంచి సర్కారు తొలగించింది. ఒకే ఇంట్లో వితంతు, దివ్యాంగుల, బీడీ కార్మికుల పింఛన్ తీసుకుంటున్నా.. ఆదర్శ్‌కు కూడా పింఛన్ ఇవ్వొచ్చనే నిబంధన ఉంది. ఈ ప్రకారం అన్ని అర్హతలున్నా పేర్లు తొలగించడం ఏమిటని జనం భగ్గుమనడంతో ప్రభుత్వం రీ సర్వేకు ఆదేశించింది.

కొత్త పింఛన్లకు లైన్ క్లియర్



జిల్లాలో కొత్త పింఛన్లకు లైన్ క్లియర్ అయింది. రీ సర్వేలో అర్హత కలిగిన పేర్లతో జాబితాను ప్రభుత్వానికి పంపించగా 239 మందికి మంజూరు వచ్చింది. మిగతా వారి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. విడతల వారీగా మంజూరయ్యే అవకాశం ఉంది.

– గూడూరు రాంరెడ్డి, డీఆర్డీఓ

మండలాల వారీగా మంజూరైన కొత్త పింఛన్ల వివరాలు							
మండలం	జఫర్‌గఢ్	బచ్చన్నపేట	చిల్పూరు	దేవరుప్పుల	స్టేషన్‌ఘన్‌పూర్	జనగామ రూరల్	కొడకండ్ల
మంజూరైన పింఛన్లు	13	26	15	27	12	19	15
మండలం	లింగాలఘణపురం	నర్మెట	పాలకుర్తి	రఘునాథపల్లి	తరిగొప్పుల	జనగామ మున్సిపల్	
మంజూరైన పింఛన్లు	29	12	18	21	12	20	

ప్రాణాలు పోతున్నాయ్..



దళారుల బెడద లేకుండా భూముల క్రయవిక్రయాలు చేసుకోవచ్చని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్‌తో ప్రాణాలు పోతున్నాయని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. జనగామకు చెందిన కేమిడి మైసమ్మకు లింగాలఘణపురం మండలం నాగారం శివారు 180, 181 సర్వే నంబర్లలో 1.16 ఎకరాల భూమి ఉంది. ఆమె ఇటీవల అనారోగ్యానికి గురికాగా.. చికిత్సకు డబ్బులు లేక తనకున్న భూమిలో 16 గుంటలు విక్రయించి.. బయానాగా కొంత మొత్తం తీసుకుంది. గత ఏడాది జూన్‌లో రిజిస్ట్రేషన్ చేయడానికి వెళ్లగా సదరు భూమి నిషేధిత జాబితాలో ఉందని చెప్పారు. ఇదేమిటని తహసీల్దార్ కార్యాలయానికి వస్తే 'అంతా కోర్టు పరిధిలో ఉంది.. మాకు ఎలాంటి సంబంధం లేదని' అధికారులు చెప్పడంతో మైసమ్మ ఏమి చేయలో తోచక మదన పడుతోంది.

నిషేధిత జాబితాలో ఎలా చేర్చారు..?

- తహసీల్దార్‌తో నాగారం రైతుల వాగ్వాదం

లింగాలఘణపురం: తమ భూములు ఏ విధంగా నిషేధిత జాబితాలో చేర్చారో చెప్పాలని మండల పరిధి నాగారం గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం తహసీల్దార్ అంజయ్యతో వాగ్వానికి దిగారు. ఈ విషయమై ఈనెల 5న కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ కార్యాలయంలో అడగాలని చెప్పడంతో రైతులు లవకుమార్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గొరిగె మదార్, కృష్ణ, అంజనేయులు తదితరులు ఇక్కడకి వచ్చారు. కొనుగోలు చేసిన భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి.. రైతుబంధు డబ్బులు వస్తున్నాయి.. అలాంటి భూమిపై ఎవరు కోర్టులో కేసులు వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల రైతుబంధు సాయం రావడంలేదు.. పంట రుణాలు రెన్యూవల్ కావడంలేదు.. ఆపదకు అమ్ముకోవడానికి కూడా వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ అంజయ్య మాట్లాడుతూ కోర్టు కేసు ఉన్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో చేరిందని, దీనితో మాకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.



తహసీల్దార్ అంజయ్యతో వాగ్వాదం చేస్తున్న నాగారం రైతులు

'స్వచ్ఛత' అందరి బాధ్యత

- మున్సిపల్ చైర్‌పర్సన్ జమునలింగయ్య

జనగామ: 'స్వచ్ఛత' అందరి బాధ్యత.. ఇందుకు పట్టణంలో చేపట్టే కార్యక్రమంలో ప్రజలు భాస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున లింగయ్య అన్నారు. 26వ వార్డులో శుక్రవారం తడి, పొడిచెత్తపై ప్రజలకు ఆమె అవగాహన కల్పించారు. ఇంట్లో తడి, పొడిచెత్తను వేరు చేసి మున్సిపల్ సేకరణ సిబ్బంది వచ్చిన సమయంలో ఇవ్వాలని చెప్పారు. ఇళ్ల నుంచి 'స్వచ్ఛత' మొదలైతేనే పురపాలికకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు తదితరులు పాల్గొన్నారు.



26వ వార్డులో తడి, పొడిచెత్త సేకరణపై వివరిస్తున్న చైర్‌పర్సన్ జమున

ప్రతి ఒక్కరికీ సర్కారు వైద్యసేవలు

- హైదరాబాద్ నుంచి మంత్రి హరీష్‌రావు టెలి కాన్ఫరెన్స్

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో సర్కారు వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, కుటుంబ, ఆరోగ్య, సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతామహంతి అన్నారు. కంటి వెలుగు, ప్రసూతి, జనరల్ పరీక్షలు, వివిధ రకాల ఆపరేషన్లు, వైద్య సేవలపై హైదరాబాద్ నుంచి శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే 'కంటి వెలుగు'లో గ్రామాల వారీగా ప్రతి ఒక్కరికీ నేత్ర పరీక్షలు చేసేలా ప్లాన్ చేసుకుని కార్యక్రమం నూరు శాతం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. శిబిరాలు నిర్వహించే గ్రామాల్లో ముందస్తు పర్యటనలు చేయాలని చెప్పారు. అలాగే ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రుల్లో కాన్పులు, ఓపీ, జనరల్ సర్జన్లు, ఇతర వైద్య సేవల విషయంలో అలసత్వం వహించొద్దని అన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.మహేందర్, ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



టెలి కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ, అధికారులు

'కంటి వెలుగు'ను విజయవంతం చేద్దాం

- డీఏఓ, ప్రత్యేక అధికారి వినోద్‌కుమార్

కొడకండ్ల: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేద్దామని జిల్లా వ్యవసాయ అధికారి, పాలకుర్తి నియోజకవర్గ ప్రత్యేక అధికారి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వైస్ ఎంపీపీ వీరసోములు అధ్యక్షతన మండల పరిషత్‌లో నిర్వహించిన కంటి వెలుగు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలపై సర్పంచ్, పంచాయతీల కార్యదర్శులు విస్తృతంగా ప్రచారం చేయించాలన్నారు. నిర్దేశించిన సమయానికి ముందే సిబ్బంది క్యాంపుల వద్ద ఉండాలని, సిబ్బంది స్థానికంగా ఉంటూ సమయపాలన పాటించాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకన్న, ఎంపీడీఓ సురేందర్‌నాయక్, డాక్టర్లు విష్ణు, హరికృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ కుమారస్వామి, సర్పంచ్‌లు మధుసూదన్, రాములు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఏఓ వినోద్‌కుమార్

ఆరోగ్య తెలంగాణలో భాగంగా..

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరోగ్య తెలంగాణలో భాగంగా కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చారని, విజయవంతానికి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి
- ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్
- విజేత కంచనపల్లి, రన్నరప్ ధర్మసాగర్

స్టేషన్‌ఘన్‌పూర్: యువత అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నమిలిగొండలో 23 రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు కంచనపల్లి, ధర్మసాగర్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను కడియంతోపాటు జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ ప్రారంభించారు. ఇందులో కంచనపల్లి జట్టు విజేతగా నిలిచింది. అనంతరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.30వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్‌కు బహుమతులను అతిథులు అందజేశారు. కడియం మాట్లాడుతూ.. పోటీల్లో 72 జట్లు పాల్గొన్నాయని, టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, నమిలిగొండ సర్పంచ్ ఉప్పలస్వామి, ఎంపీటీసీ పురమాని రజాక్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు సీహెచ్.నరేందర్ రెడ్డి, బూర్ల లతాశంకర్, కోతి రేణుకరాములు, అన్నం బ్రహ్మారెడ్డి, పోగుల సారంగపాణి, జగన్‌మోహన్‌రెడ్డి, లింగారెడ్డి, కరుణాకర్, రాంబాబు, రాజేష్ నాయక్, నీల గట్టయ్య, నీరటి ప్రభాకర్, దశరథ్ నాయక్, నాగరాజు, హఫీజ్ పాల్గొన్నారు.



విజేత కంచనపల్లి జట్టుతో కడియం, తదితరులు



రన్నరప్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

నేడు ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్

జనగామ రూరల్: దివ్యాంగుల సదరం క్యాంపు కోసం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని డీఆర్డీఓ రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులు(కొత్తవారికి) 20, రెన్యూవల్ 30 మందికి అవకాశం ఉందని, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి 10వ తేదీన క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రాము

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో 'మనఊరు-మనబడి' పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. శుక్రవారం మండల పరిధి మండలగూడెం, నిడిగొండ, భాంజీపేట స్కూళ్లను ఆయన ఆకస్మికంగా సందర్శించి పనులను పరిశీలించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ఆరు పేపర్లపై అవగాహన కల్పించారు. భాంజీపేటలో సబ్జెక్టుల వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. 'తొలిమెట్టు' కార్యక్రమంలో అనుకున్న ఫలితాలు రాబట్టడం వల్ల జిల్లా రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి చంద్రభాను, మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి, హెచ్‌ఎంలు భారతిరవీందర్, పద్మజ, వెంకటేశ్వర్లు, తులసిరత్నం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రాము

చకచకా మెడికల్ కళాశాల పనులు

- వసతుల పరిశీలనకు త్వరలో ప్రత్యేక బృందం రాక
- మారిన జిల్లా ఆస్పత్రి బోర్డు
- మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిగా ఏర్పాటు
- గతంలోనే డీఎంఈకి అప్పగింత

జనగామ: జిల్లాలో మెడికల్ కళాశాల సేవలు కొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతున్నాయి. ఈ మేరకు పనులు చకచకా జరుగుతున్నాయి. గత ఏడాది ఫిబ్రవరి 11న కలెక్టరేట్‌ను ప్రారంభించేందుకు వచ్చిన సీఎం కేసీఆర్.. మెడికల్ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేసిన సర్కారు.. పట్టణంలోని సిద్దిపేట రోడ్డున స్థల సేకరణ సైతం పూర్తి చేసింది. జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌కు మధ్యలో మెడికల్ కళాశాల భవనం నిర్మించనున్నారు. వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్న జిల్లా ఆస్పత్రిని గత కొద్ది రోజుల క్రితం డిస్ట్రిక్ట్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు అప్పగించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఆస్పత్రి బోర్డు స్థానంలో 'గవర్నమెంట్ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి జనగామ'గా మార్చారు.



ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి..

జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసిన తర్వాత.. బడ్జెట్, స్థల సేకరణతో పాటు వైద్యుల నియామకం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లా ఆస్పత్రి డీఎంఈ చేతికి వెళ్లిన తర్వాత.. మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్, ఆస్పత్రికి సూపరింటెండెంట్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం మెడికల్ కళాశాలకు అవసరమైన వసతులు ఒకొక్కటి కల్పిస్తుండగా.. ఇటీవల డాక్టర్లు(ఎస్ఆర్) కూడా వచ్చారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు జిల్లా ఆస్పత్రి(మెడికల్ కళాశాల/జనరల్ ఆస్పత్రి)లో ప్రత్యేక చాంబర్ సిద్ధం చేశారు. ప్రత్యేక బృందం వచ్చిన తర్వాత అనుమతుల మంజూరు మాత్రమే మిగిలి ఉంటుంది.

వారంలో ప్రత్యేక బృందం రాక

ప్రభుత్వ జీఓ మేరకు మెడికల్ కళాశాలకు తగిన సదుపాయాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక బృందం వారం రోజుల్లో ఇక్కడికి రానుంది. జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో 300 పడకల సామర్థ్యం, జనరల్, ప్రసూతి, ఆపరేషన్ థియేటర్, చిన్న పిల్లల వార్డులు, వైద్యులు, వైద్య సిబ్బంది, టీచింగ్, ఓపీ సంఖ్య, ఇతర కేటగిరీల్లో పనిచేస్తున్న వారితో పాటు మెడికల్ కళాశాలకు అనుకూలంగా ఎటువంటి వాతావరణం ఉందనే దానిపై పరిశీలించనున్నారు.

జిల్లా ఆస్పత్రి ఎక్కడ..?

జిల్లా ఆస్పత్రి.. మెడికల్ కళాశాల/జనరల్ ఆస్పత్రిగా మారడంతో డిస్ట్రిక్ట్ ఆస్పత్రి ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, పాలకుర్తిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీ) ఉన్నాయి. వీటిని ఇటీవల వైద్య విధాన పరిషత్‌కు మార్చారు. జిల్లా ఆస్పత్రి ఎక్కడ అనే దానిపై సమాలోచనలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు.. మారుమూల నియోజకవర్గమైన పాలకుర్తిలో అయితే బాగుంటుందని అనుకున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై కలెక్టర్ నేతృత్వంలో సమీక్ష నిర్వహించిన తర్వాత సర్కారుకు నివేదిక పంపించనున్నట్లు సమాచారం.

జీఓ ప్రకారం ఏర్పాట్లు..



మెడికల్ కళాశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం.. ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా ఆస్పత్రి బోర్డు స్థానంలో గవర్నమెంట్ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి జనగామగా పేరు మార్చాం. ప్రస్తుతం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ప్రత్యేక చాంబర్ సిద్ధం చేశాం. మెడికల్ కళాశాల ఆస్పత్రికి అనువుగా ఉందా లేదా అని తెలుసుకునేందుకు త్వరలో ప్రత్యేక బృందం రానుంది.

– డాక్టర్ సుగుణాకర్‌రాజు, మెడికల్ సూపరింటెండెంట్

'ఎంఎల్‌హెచ్‌పీ' దరఖాస్తులకు నేడు చివరి రోజు



దరఖాస్తులు అందజేస్తున్న అభ్యర్థులు

జనగామ: పల్లె దవాఖానల్లో 22 చోట్ల ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్)లుగా పని చేసేందుకు మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారుల నుంచి జిల్లా వైద్యారోగ్య శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈనెల 4న కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయగా.. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 105 దరఖాస్తులు వచ్చాయి. శనివారం(నేడు) ఒక్కరోజే అవకాశం ఉంది. 8, 9 తేదీల్లో దరఖాస్తులను స్క్రూటినీ చేసి, 10వ తేదీన తాత్కాలిక మెరిట్ జాబితా ప్రదర్శన, అభ్యంతరాల ప్రకటన, 11న అభ్యంతరాలు, ప్రత్యుత్తరాల స్వీకరణ, 12న ఫైనల్ జాబితా ప్రకటిస్తారు. 13న మెరిట్ జాబితాలోని వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేస్తారు.

రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం


రామ్‌రాజ్ షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జమున

జనగామ: జనగామ జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూం ను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాణ్యత, సంప్రదాయ వస్త్ర ప్రపంచానికి పెట్టింది పేరుగా నిలిచిన రామ్‌రాజ్ షోరూం జనగామలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ రామ్‌రాజ్ కాటన్ నిపుణుల పర్యవేక్షణలో మృదువైన వస్త్రాలు అన్ని రంగుల్లో తయారు చేస్తున్నామని.. మహిళలు, పురుషులు, చిన్నారులకు కావాల్సిన దుస్తులు మా షోరూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ ఫౌండర్, చైర్మన్ కేఆర్ నాగరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాంకుడోతు అనిత, బండ పద్మ, ప్రముఖులు నగేష్, పజ్జూరి జయహరి, బండ యాదగిరిరెడ్డి, మాశెట్టి వెంకన్న, బచ్చు రమేష్, బచ్చు పవన్, పజ్జూరి జయహరి, యాంసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం

- నిందితుడిపై పోక్సో కేసు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామానికి చెందిన పులి రజనీకుమార్ అనే యువకుడు సమీప గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్రాలకు చెందిన రజనీకుమార్ సమీప గ్రామంలోని అతడి అక్క(పెద్దమ్మబిడ్డ) ఇంటికి ఈనెల 1న చుట్టపుచూపుగా వెళ్లాడు. ఈనెల 2న ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె కుమార్తె వరుసకు కోడలైన పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేయగా బాలిక గట్టిగా అరవడంతో పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. కాగా, నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


దోర్నకల్ రైల్వేస్టేషన్ ఆవరణలో సేదతీరుతున్న కూలీలు

మహారాష్ట్ర టు మానుకోట

మహారాష్ట్ర కూలీలు మహబూబాబాద్ జిల్లాకు తరలివస్తున్నారు. మానుకోటతో పాటు దోర్నకల్‌లో రైళ్లు దిగి.. మిర్చి తోటల్లో పనులకు గ్రామాలకు వెళ్తున్నారు. కాగా మహారాష్ట్ర నుంచి కుటుంబసమేతంగా జిల్లాకు చేరుకొని రెండు మూడు నెలలపాటు మిర్చి తోటలోనే గుడారాలు వేసుకొని కోతలు ముగిసిన అనంతరం తిరిగి స్వస్థలాలకు వెళ్తారు.

-దోర్నకల్/సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లా కేంద్రంగుండా శుక్రవారం వాహనాలలో కిక్కిరిసి వెళ్తున్న కూలీలు

నలుగురు వాహనదారులపై చీటింగ్ కేసు

కాజీపేట: కాజీపేటలోని ఫాతిమా జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసి తిరుగుతున్న నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై రాజేష్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మహేందర్, చెవ్వ సాంబరాజు, గబ్బెట కిరణ్, మునిగంటి రవికుమార్‌లు నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. ఎస్సై ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతిని బ్లాక్ మెయిల్ చేస్తున్న యువకుడిపై..

యువతిని బ్లాక్ మెయిల్ చేస్తూ శారీరకంగా వాడుకుంటున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం తండాకు చెందిన వాంకుడోత్ చంద్ర మడికొండ సమీపంలోని ఓ దాబా టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. దాబా సమీపంలో ఉండే యువతితో పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. తరచూ ఫోన్ చేయడం, మెసేజ్‌లు పంపించడం గుర్తించిన యువతి తల్లిదండ్రులు తమ కూతురుని తీసుకుని స్వగ్రామానికి వెళ్లిపోయారు. అక్కడికి సైతం వెళ్లిన చంద్ర గదికి రాకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు దిగాడు. దీంతో యువతి తల్లిదండ్రులు కాజీపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి వివరించారు.

ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ పోటీలకు కేయూ జట్టు


కేయూ జట్టుతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: పూణేలోని సావిత్రిబాయి పూలే యూనివర్సిటీలో ఈ నెల 9 వరకు నిర్వహించబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న శుక్రవారం తెలిపారు. జట్టులో సుమయ్యత బుస్సం, జె.మాధురి (వరంగల్ కిట్స్ కళాశాల), మనీషా(యూనివర్సిటీ కాలేజీ), ఎస్.పరమేశ్వరి, ఎ.అఖిల, ఎన్.సుస్మిత (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఉమెన్ వరంగల్ వెస్ట్), కె.అంజలి, పి.వందన, జి.ప్రవళిక(టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ మంచిర్యాల) ఉన్నారు. వీరికి మేనేజర్‌గా అసిఫాబాద్ టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ(ఉమెన్) ఫిజికల్ డైరెక్టర్ బి.హారిక వ్యవహరిస్తారు.

మృత్యువుతో పోరాడి జూనియర్ లైన్‌మన్ మృతి

కాజీపేట: స్తంభంపై నుంచి జారిపడిన జూనియర్ లైన్‌మన్ ఆవునూరి మధు(29) మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాజీపేట నిట్ ప్రాంతంలో టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో మధు జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని బుధవారం ఫోన్ రావడంతో స్తంభం ఎక్కి జారి కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మధును ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి తెలిపారు.


మధు (ఫైల్)

విజయ డెయిరీ ఉత్పత్తులనే వాడాలి

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్


మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ చౌరస్తా: ప్రైవేట్ డెయిరీల పాలలో వైట్‌నర్, యూరియా వంటి రసాయనాలు కలుస్తున్నాయని, మనమంతా స్వచ్ఛమైన విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులనే వాడుదామని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని విజయ డెయిరీ వరంగల్ యూనిట్ ఆవరణలో శుక్రవారం జరిగిన పాడిరైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నగరంలో విజయ పాల ఉత్పత్తులను అమ్మేందుకు నిరుద్యోగ యువతతో స్టాళ్ల ఏర్పాటు చేయిస్తానని, ట్రై సైకిళ్లు అందజేసి ప్రధాన కూడళ్లలో అమ్మకాలు జరిగేలా చూస్తామని అన్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో త్వరలో కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విజయ డెయిరీ పాడి రైతుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు, విజయ డెయిరీ డీడీ ప్రదీప్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ, వరంగల్ జిల్లా అధికారి బాలకృష్ణ, పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ రఘుబాబు, కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

- వర్సిటీలకు నిధులు రెట్టింపు చేయాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


మహాసభలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో వివిధ కేటగిరీలో పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమన్నారు. యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ సరిపోవడం లేదని, బ్లాక్ గ్రాంట్‌ను రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులను బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో అనేక లోపాలున్నాయని, దానికి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ యూనివర్సిటీల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సభలో ఏపీ ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఎంప్లాయీస్ వర్కర్స్ అండ్ టీచర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటేష్, ఆల్ ఇండియా యూనివర్సిటీస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎ.రామచందర్, జనరల్ సెక్రటరీ పెండ్యాల రవి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిరోధించాలి


మాట్లాడుతున్న నర్సింహ

మడికొండ: ప్రసార మాధ్యమాలలో మూఢ నమ్మకాలను నిరోధించాల్సిన అవసరముందని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ అన్నారు. కాజీపేట మండలం మడికొండ శివారు రాజన్నబండ వద్ద నిర్వహిస్తున్న ప్రజానాట్య మండలి జిల్లా శిక్షణ తరగతుల్లో శుక్రవారం రెండో రోజు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రచార మాధ్యమాలలో ద్వారా మూఢ నమ్మకాలు విస్తరిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించకపోవడం శోచనీయం అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మినీ రవీంద్ర భారతి నిర్మించాలని, అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, కేతరాజు ఉప్పలయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకుడు రాజమౌళి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టెపాక రవి, అధ్యక్షుడు గడ్డం రాజనర్సు, మాలోత్ శంకర్, రాసమల్ల దీన, స్వరూప, రాజమణి, రమేష్, మమత, మాధురి, శ్యామ్, రమేష్ పాల్గొన్నారు.

స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి మందలిస్తాడేమోనని..

- పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విష్ణు

కేసముద్రం: స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి మందలిస్తాడనే భయంతో విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమంచ్యాతండా శివారు గుడితండాలో శుక్రవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గుడితండాకు చెందిన ధరంసోత్ విష్ణు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రితం బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. అప్పటికే ఊరికి వెళ్లిన అతడి తండ్రి రాము తిరిగి ఇంటికి వచ్చాక మందలిస్తాడనే భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి విష్ణు ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు, తండావాసులు మానుకోటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విష్ణు ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

తలసేమియా బాధితులకు అండగా..

- యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం రేపు మెగా రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తూ.. (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : తలసేమియా జన్యు సంబంధమైన వ్యాధి. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఏ వయస్సు వారికైనా వ్యాధి రావొచ్చు. ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి 15రోజులకోసారి రక్తం మార్పిడి చేయాలి. లేదంటే వారు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 200 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారికోసం యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. సేకరించిన రక్తాన్ని హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో భద్రపరిచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా అందిస్తున్నారు.

2016 నుంచి..

అత్యవసర సమయాలు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే ఉద్దేశంతో 2016లో వరంగల్‌కు చెందిన స్విమ్మర్ రాజు, కొత్తకొండ అరుణ్‌కుమార్ కలిసి వరంగల్‌లో యువ నేతాజీ ఫౌండేషన్ నెలకొల్పారు. ఇప్పటి వరకు 31రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి దాతల సహకారంతో 5,071 మందికి ఉచితంగా రక్తం అందించారు. కరోనా సమయంలో ఫౌండేషన్ ద్వారా ప్లాస్మాదానంపై అవగాహన కల్పించి 235 మందితో ప్లాస్మాదానం చేయించారు. కోవిడ్ సమయంలో కేవలం తలసేమియా చిన్నారుల కోసం 22 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 1,254 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్‌కు అందించారు.

రేపు శిబిరం

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం(రేపు) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. వివరాలకు 94901 15105, 96661 09108 నంబర్లలో సంప్రదించాలని సిమ్మర్ రాజు, కొత్తకొండ అరుణ్ కుమార్ కోరారు.

యువతలో అవగాహన కల్పించాలన్నదే ధ్యేయం...



యువతకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇప్పటి వరకు 30సార్లు రక్తదానం చేశాను. శిబిరంలో సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో భద్రపరిచి సేకరించిన రోజు నుండి 5రోజుల్లో తలసేమియా బాధితులకు ఉపయోగించాలి. లేదంటే వారికి ఉపయోగపడదు. మేము అత్యవసరమైన వారికి రక్తం అందిస్తాం. మాతో పాటు యువతలో అవగాహన కల్పించాలన్నదే మా ధ్యేయం.

\- సిమ్మర్ రాజు

తలసేమియా బాధితుల కోసం..



తలసేమియా బాధితులకు ఉయోగపడాలని నేను 28 సార్లు రక్తదానం చేశాను. దీంతో అత్యవసరమైన వారి ప్రాణాలు కాపాడినవారం అవుతాం. ఆదివారం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి.

\- కొత్తకొండ అరుణ్ కుమార్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత వరంగల్


ట్రోఫీ అందుకుంటున్న వరంగల్ జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టు

కాశిబుగ్గ: రెండు రోజులుగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్స్‌లో వరంగల్ – హైదరాబాద్ జట్లు తలపడగా 11-10 గోల్స్ తేడాతో వరంగల్ జట్టు ఘన విజయం సాధించి చాంపియన్‌గా నిలవగా హైదరాబాద్ బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది. అలాగే, మూడోస్థానం కోసం జరిగిన పోటీలో ఖమ్మం-మహబూబ్‌నగర్ జట్ల నడుమ మ్యాచ్ నిర్వహించగా ఖమ్మం విజయం సాధించింది. ఈసందర్భంగా విజేత జట్టుతో పాటు రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోట్ల శ్రీకాంత్, డాక్టర్ పాటిబండ్ల రఘునందన్, మిత్ర ఫౌండేషన్ అధినేత కురెవేళ్ల ప్రవీణ్‌కుమార్‌తో పాటు రాము, శ్రీనివాస్, కృష్ణయ్య, మోహన్ పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పోచయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రెండు రోజులపాటు జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. వివిధ కళాశాలల నుంచి 350 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు, క్రీడాకారులకు హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో స్టేట్ మీట్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ మీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇన్‌చార్జ్ పీడీ ఎం.రాజ్‌కుమార్, హెచ్ ట్రిపుల్ ఈ రామక్రిష్ణ, ఏఓ మనోహర్‌రావు, పీఈటీలు వాసుదేవరావు, మనోజ్‌కుమార్, కొండ రవి, వంచ చంద్రశేఖరరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, గోపాలకృష్ణ, వేణు, సుధాకర్, కుమార్ పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు

వరంగల్ స్పోర్ట్స్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ మైదానంలో శని, ఆదివారం జరగనున్న 5వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూర్యారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పురుషుల జట్టులో రాజీవ్, వెంకటేశ్, రాజు, పవన్‌కళ్యాణ్, రాకేష్, బీష్మ, ప్రసాద్, హరి, రమణ, తరుణ్, రత్నకుమార్.. మహిళల జట్టులో రీతూ, దీక్షిత, ఆశ్రిత, వెన్నెల, మీనాక్షి, బ్రింద, జోత్స్న, గౌషియా, సంజూష, ఇషిత, శ్రీచందన, తేజస్వీ ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం(ఈ నెల 8న) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.వీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు నిర్వహించే ఈ ఎంపికల్లో 19 ఏళ్లలోపు వయస్సున్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు జేఎన్ఎస్‌లో హాజరుకావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి 14వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే 67వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.